## క్లుప్తంగా

### నేడు గృహసారథులకు శిక్షణ

- హాజరు కానున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

**మార్టూరు/చినగంజాం/యద్దనపూడి:** నేడు వైఎస్సార్ సీపీ గృహ సారథుల శిక్షణా కార్యక్రమానికి నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నట్లు యద్దనపూడి, మార్టూరు మండలాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయ నిర్వాహకులు తెలిపారు. ఇంకొల్లు ఏఎంసీలో, మార్టూరు గ్రామంలోని విజయలక్ష్మి కల్యాణ మండపంలో, యద్దనపూడి వెలుగు కార్యాలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమీక్ష సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి మండలంలో గ్రామాల వారీగా ఎంపిక చేసిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు , సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల, గ్రామస్థాయి నాయకులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

### నేడు పర్చూరులో మెగా జాబ్‌మేళా

**పర్చూరు:** ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణ మోహన్ ఆదేశాల మేరకు 31 వతేదీ శుక్రవారం పర్చూరులోని బీఏఆర్ అండ్ టీఏ జూనియర్ కాలేజీ ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కృష్ణంశెట్టి రమేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఏదైనా డిగ్రీ, పీజీ అర్హతలు కలిగిన యువతీ, యువకులు తమ బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు తీసుకురావాలని వారు తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర సమాచారం కోసం పీ వినోద్ కుమార్ 63027 64962, పీ శ్రీకాంత్ 99669 19485 నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

### నేడు అద్దంకిలో వైఎస్సార్ ఆసరా పంపిణీ

**అద్దంకి రూరల్:** వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ఏపీఎం కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య హాజరవుతారని తెలిపారు.

### సీఎం జగన్‌కు ధన్యవాదాలు

**చినగంజాం:** రాష్ట్రంలో దళిత క్రైస్తవులను ఎస్సీ హోదాకు సిఫారసు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రజాసత్తా, పాస్టర్స్ పవర్, క్రిస్టియన్ పవర్‌ల వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగం పులగర శోభన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభలో ఈ మేరకు తీర్మానం చేసి కేంద్రానికి పంపడం అభినందనీయమని సీఎం జగన్‌కు క్రైస్తవులు రుణపడి ఉంటారని ఆయన పేర్కొన్నారు.

### ఏప్రిల్ 2 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

**మేదరమెట్ల:** డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని ఏప్రిల్ 2వ తేదీ నుంచి మేదరమెట్లలో జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ఉంటాయని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోటీల్లో పాల్గొనదలచిన జట్లు రూ.1000 ఎంట్రీ ఫీజును చెల్లించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు వరుసగా మొదటి బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.15 వేలు, నాలుగో బహుమతిగా రూ.10 వేలు నగదు అందజేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 91827 79423, 81069 17916 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

### సత్తాచాటిన సానికవరం టీమ్

**పెద్దారవీడు:** మండలంలో మద్దలకట్ట జెడ్పీహెచ్ పాఠశాలలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం గ్రామస్తులు ప్రారంభించారు. సానికవరం టీమ్, మార్కాపురం మండలం బిరుదలనర్వ టీమ్ పోటీపడ్డాయి. టాస్ గెలిచిన సానికవరం టీమ్ 12 ఓవర్లలో 92 పరుగులతో గెలిచింది. బిరుదలనర్వ టీమ్ 11.4 బంతుల్లో 89 పరుగులకు ఆలౌటైంది. అంపైర్లుగా జెడ్డా దానియోలు, జి. భరత్‌రెడ్డిలు వ్యవహరించారు. సర్పంచ్ గుంటు గాలెమ్మ, వైస్ సర్పంచ్ మద్దూరు దానియేలు, స్కూల్ చైర్మన్ మూల వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్ మూల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ జెడ్డా లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మూల సత్యనారాయణరెడ్డి, ఏర్వ తిరుమలకొండారెడ్డి పాల్గొన్నారు.

### దివ్యాంగులకు వైద్య శిబిరం

**తర్లుపాడు:** మార్కాపురంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో విర్కో ఫౌండేషన్ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఏప్రిల్ 5న వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు డి. గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లోని దివ్యాంగులను కలిసి శిబిరానికి రావాలని కోరారు. ప్రమాదాల్లో కాళ్ళు, చేతులు కోల్పోయిన వారు, పోలియో వలన దివ్యాంగులైన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, కృత్రిమ పరికరాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డిని మండల పార్టీ అధ్యక్షులు మురారిని కలిసి వైద్య శిబిరం గురించి వివరించారు.

# జయ జయ రామ జగదభిరామా..


శింగరకొండ దేవస్థానం వద్ద ఏర్పాటు చేసి పందిరిలో సీతారాముల కల్యాణం


మేదరమెట్ల రామాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైవీ భద్రారెడ్డి


చీరాల: రాములవారి కల్యాణంలో పూజలు చేస్తున్న డీఎస్పీ శ్రీకాంత్ దంపతులు


పంగులూరులో సీతారామ కల్యాణ విగ్రహాలు

- కమనీయంగా రాములోరి కల్యాణం
- వీధివీధిన శ్రీరామనవమి
- జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

**చినగంజాం/కారంచేడు/పర్చూరు/మార్టూరు/యద్దనపూడి:** నీలిమేఘ శ్యాముడు.. సకల గుణాభిరాముడు శ్రీరాముడు మిథిలానగర యువరాణి జానకిల వివాహ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలను యద్దనపూడి మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గన్నవరం, యద్దనపూడి, అనంతవరం, చింతపల్లిపాడు, పూనూరు, పోలూరు, జాగర్లమూడి గ్రామాల్లోని వీధుల్లో చలువ పందిళ్లలో సీతారాముల ప్రతిమలను ఉంచి రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈమహోత్సవంలో మాంగల్యధారణ రమణీయంగా సాగగా తలంబ్రాల వేడుక పరమానందంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

➤ శ్రీరామనవమి పర్వదినాన్ని చినగంజాం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. అన్ని రామాలయాల్లో సీతారామ కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్యంగా తీరప్రాంత మత్స్యకార గ్రామాల కుటుంబాలు రామాలయాల్లో కల్యాణం నిర్వహించారు. చినగంజాం భావన్నారాయణస్వామి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరీ మందిరం, సోపిరాల సీతారామాలయం, కడవకుదురు కోదండ రామస్వామి ఆలయం, మూలగాని వారిపాలెం సీతారామాలయం, పల్లెపాలెం రామాలయం, పెదగంజాం భావన్నారాయణ స్వామి ఆలయం, నీలాయపాలెం రామాలయంలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చినగంజాం భావన్నారాయణస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు నరసింహాచార్యులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించగా పలువురు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

➤ శ్రీరామ నవమిని పురస్కరించుకొని కారంచేడు మండల కేంద్రం కారంచేడుతో పాటు, స్వర్ణ, కుంకలమర్రు, ఆదిపూడి, తిమిడెదపాడు, దగ్గుబాడు, కొడవలివారిపాలెం గ్రామాల్లో చలువ పందిళ్ల వేసి రాములోరి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కారంచేడు చెరువుకట్ట మీద ఉన్న కోదండ రామాలయంలో అర్చకులు భక్తులతో కల్యాణం నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గోడమూల జబారు, చినవంతెన సెంటర్, కాలువ సెంటర్లలో సీతారాముల కల్యాణం జరిపించారు. మండలంలోని స్వర్ణ వెంకటేశ్వరస్వామి గుడి, వల్లభరాయస్వామి వారి ఆలయం వద్ద కూడా పెద్ద ఎత్తున కల్యాణం నిర్వహించి అన్నదానం చేశారు.

➤ శ్రీరామ నవమి వేడుకలను మార్టూరు మండలంలోని రామాలయాల్లో ఘనంగా నిర్వహించారు. రాజుపాలెం, కోలలపూడి, ద్రోణాదుల గ్రామాల్లోని కోదండ రామాలయాల్లో పెద్ద ఎత్తున హాజరైన భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. కోలలపూడి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా నేడు శుక్రవారం అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సూరగాని గంగారావు తెలిపారు.

**కిటకిటలాడిన రామాలయాలు..**


చీరాల: ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న సీతారామలక్ష్మణులు

**చీరాల టౌన్/వేటపాలెం:** శ్రీరామనవమి సందర్భంగా చీరాల పట్టణ, రూరల్ గ్రామాల్లో వాడవాడలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా పలు ప్రాంతాల్లో రాములవారి కల్యాణానికి చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. కొత్తపేట ఓంకార క్షేత్రంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో చీరాల డీఎస్పీ శ్రీకాంత్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని వీరరాఘవపేట, బెస్తపాలెం, కొట్లబజారు, పట్టాభి స్వీట్స్ సమీపంలో, రామమందిరం వద్ద, పలు దేవాలయాల్లో కల్యాణం నిర్వహించారు. ముందుగా సీతారాముల చిత్రపటాలను మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు.

➤ వేటపాలెం గడియారస్తంభం సెంటర్‌లో రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో రాములవారి కల్యాణాన్ని వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక మహాలక్ష్మమ్మ చెట్టు వద్దగల అమ్మవారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం వడపప్పు పానకం పంచిపెట్టారు. కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సీతారామ కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అణుమల్లిపేటలో గల మహాలక్ష్మమ్మ మందిరం వంద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిరిలో రాములవారి కల్యాణం వైభవంగా నిర్వహంచారు. పందిళ్లపల్లి, దేశాయిపేట, బొచ్చులవారిపాలెం, కఠారివారిపాలెం, కొత్తరెడ్డిపాలెం, రామానగర్, సర్వోదయ కాలనీలో గల రామమందిరం వద్ద సీతా రామ కల్యాణ మహోత్సవం వైభంగా నిర్వహించారు.

**శింగరకొండలో అంగరంగ వైభవంగా కల్యాణం..**

**అద్దంకి/అద్దంకి రూరల్/బల్లికురవ/జే. పంగులూరు/మేదరమెట్ల:** ఆదర్శ దంపతులు సీతారాముల కల్యాణం నియోజకవవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని పాత గాంధీ బొమ్మ సెంటర్, మండలంలోని తిమ్మాయపాలెం, రామాయపాలెం, కొటికలపూడి, ధర్మవరం, వేలమూరిపాడు, బొమ్మనంపాడు గ్రామాల్లో పందిళ్లు వేసి, కల్యాణం తరువాత పానకం, వడపప్పు భక్తులకు పంపిణీ చేశారు.

➤ అద్దంకిలోని శ్రీరామ బజార్, అత్తులూరివారి వీధి, దామావారిపాలెం, ఆంజనేయ స్వామి దేవస్థానంతో పాటు పరిసర గ్రామాల్లో, శింగర కొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, శ్రీరామ మందిరాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణోత్సవంలో పోలీసు అధికారి ఘట్టమనేని శ్రీనివాసరావు దంపతులు పీటలమీద కూర్చుని స్వామివారి కల్యాణం నిర్వహించారు.

➤ బల్లికురవ మండలం కొత్తపాలెం, గుంటుపల్లి, చినఅంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, వైదన కొప్పరపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, కూకట్లపల్లి, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొప్పరపాలెం, మల్లాయపాలెం, సామవరప్పాడు, బల్లికురవ, ఉప్పుమాగులూరు గ్రామాల్లో రామాలయాల వద్ద చలువ పందిళ్లు, ఎర్పాటు చేసి సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అలంకరించారు. వేద మంత్రోచ్ఛరణ గ్రామానికి చెందిన జంటలు కల్యాణోత్సవంలో పాల్గొని సుమారు 3 గంటల పాటు కల్యాణాన్ని నిర్వహించారు.

➤ కొరిశపాడు మండలంలోని రామాలయాలల్లో సీతారాముల కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేదరమెట్ల తూర్పుపాలెం రామాలయంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీభద్రారెడ్డి సీతారాముల కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు భద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైవీ మాట్లాడుతూ శ్రీరాముడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్ కోయి అంకారావు, మాజీ వైఎస్ చైర్మన్ రత్నారెడ్డి, జంపు హరిబాబు, బొనిగల మధు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

➤ పంగులూరు గ్రామంలోని రామమందిరంలో సీతారామ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తరించారు. పంగులూరు బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికులకు పానకం, వడపప్పు పంచారు.


పూనూరులో సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు


చినగంజాం భావన్నారాయణస్వామి ఆలయంలో ..


అణుమల్లిపేటలో సీతారామ కల్యాణం..


అద్దంకిలో కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు


బల్లికురవలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


కారంచేడులో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు, మహిళలు


కోలలపూడిలోలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు


పంగులూరు బస్టాండ్ సెంటర్‌లో పానకం పంచుతున్న భక్తులు


వేటపాలెం సెంటర్‌లో ..

# శివారుల్లో సుందరీకరణ

- రూ. 18 లక్షలతో చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ జిమ్
- ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**చీరాల:** ఎన్నోఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని చీరాల పట్టణం అభివృద్ధి పనులతో నేడు వేగంగా పరిగెడుతోంది. అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి పనులతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండుకళ్లుగా భావించింది. కావున రాష్ట్రంలోని ప్రతి పట్టణంలో మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజల మన్ననలు పొందుతోంది. పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. గత ప్రభుత్వ హయంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న శివారు ప్రాంతాలు రూపురేఖలు మారుతున్నాయి. ఇప్పటికే రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ లైన్లు వంటి మౌలిక వసతులు కల్పించారు. శివారు ప్రాంతాల్లో సుందరీకరణ పనులకు మున్సిపాలిటీ యంత్రాగం సన్నాహకాలు చేస్తోంది. ఇందులో భాగంగానే 30వ వార్డు సమీపంలో మున్సిపల్ ఓరియంటెడ్ ఎలిమెంటరీ స్కూల్ సమీపంలో రూ. 18 లక్షలతో చిల్డ్రన్ పార్కు, ఓపెన్ జిమ్‌తో పాటు పచ్చదనం, మొక్కలు పెంపకం చేస్తున్నారు. అలానే ఉదయం, సాయంత్రం వేళల్లో అందరూ పార్కును వినియోగించుకునేందుకు సిమెంట్ బల్లలు, లైటింగ్, ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేసినట్లు డీఈ యేసయ్య తెలిపారు. ఈ పార్కు పనులు మరికొద్ది రోజుల్లో పూర్తికానున్నాయి. శివారు ప్రాంతాలుగా పేరున్న వైకుంఠపురం, విఠల్‌నగర్, హరిప్రసాద్‌నగర్, ఉజిలిపేట, జవహర్‌నగర్, జయంతిపేట వాసులకు ఎంతగానో ఉపయోగపడనుంది. జిమ్ కోసం రైలు పట్టాలు దాటి వెళ్లకుండా ఉచితంగానే వ్యాయమం చేసుకునే అవకాశం ఉంటుంది. అలానే సెలవు దినాల్లో పిల్లలు ఆడుకునేందుకు ఆట సామగ్రి ఏర్పాటు చేశారు. పెద్దలు సేదతీరేందుకు గాను సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు, పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


జిమ్‌లో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు


చిల్డ్రన్స్ పార్క్

**జిమ్ కోసం దూరప్రాంత్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.**



రైల్వే ట్రాక్ పడమర వైపు ఉన్న వార్డు ప్రజలకు ఈ పార్కు వలన ఎంతో ప్రయోజనం ఉంటుంది. జిమ్ కోసం రైలు పట్టాలు దాటుకుని వెళ్లిరావడం కష్టతరంగా ఉంటోంది. ఉచితంగా జిమ్ వసతి కల్పించడం ఎమ్మెల్యే కరణం బలరాంకు కృతజ్ఞతలు.

– కీర్తి వెంకట్రావ్ కౌన్సిలర్, 28వ వార్డు

**మా వార్డుకు చాలా ప్రయోజనం..**



29వ వార్డు పరిధిలో హరిప్రసాద్‌నగర్, జవహర్ నగర్ వంటి శివారు ప్రాంతాలు ఉన్నాయి. రూ. 18 లక్షలతో చిల్డ్రన్స్ పార్కు, జిమ్, సుందరీకరణ చేసేందుకు సహకరించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు.

–బత్తుల అనీల్, కౌన్సిలర్, 29 వవార్డు

**అడిగిన వెంటనే నిధులు మంజూరు చేశారు..**



తమ వార్డు గత ప్రభుత్వ హయంలో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం మురికివాడలుగా పేరున్న ఉజిలిపేటలో అన్ని వసతులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ ఏరియాలో పార్కు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను అడిగాం. ఆయన వెంటనే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మంజూరు చేశారు.

– కంపా ఆరుణ్, కౌన్సిలర్, 30వ వార్డు

### శింగరకొండ దర్శిని

**అద్దంకి:** శోభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం పుష్యమి నక్షత్రం దశమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు